



sahanamvande.com

epaper.sahanamvande.com

# సహానం వందే

హైదరాబాద్ | 18-09-2026 శుక్రవారం | సంపుటి-02 సంచిక : 154 EDITOR: ROHINI




# కార్పొరేట్ కల్చర్‌లో సిగరెట్ ట్రెండ్

## భవిష్యత్తును కాల్చేస్తున్న టెక్ నిపుణులు



**ఆ**ర్గానిక్ ఫుడ్, యోగా, జిమ్ అంటూ తిరిగే ఐటీ కుర్రాళ్లు ఇప్పుడు చేతిలో సిగరెట్ పట్టుకుని దమ్ము లాగుతున్నారు. కోట్లు సంపాదించే సిలికాన్ వ్యాలీ టెక్ నిపుణులు, స్టార్టప్ ఫౌండర్లు ధూమపానాన్ని ఒక శక్తివంతమైన బిజినెస్ ఆయుధంగా మార్చుకున్నారు. ఆరోగ్య సూత్రాలను పక్కనబెట్టి, బిజినెస్ డీల్స్ ఓకే చేసుకోవడానికి పొగ ఊదడమే సరైన మార్గమని నమ్ముతున్నారు.

**- సహానం వందే, హైదరాబాద్**

- ధైర్యానికి గుర్తుగా ధూమపాన సూత్రం
- బిజినెస్ డీల్స్ కోసం తెగ ఊదేస్తున్నారు
- విదేశీ సిగరెట్ బ్రాండ్లకు భారీ డిమాండ్
- ఆరోగ్యం కంటే వ్యాపార ప్రయోజనాలే మిన్న
- హెల్త్ సంగతి ఏఐ చూసుకుంటుందన్న ధీమా

అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న టెక్ రాజధానుల్లో ఇప్పుడు ఒక విచిత్రమైన వాతావరణం కనిపిస్తోంది. చాలామంది స్టార్టప్ ఫౌండర్లు చేతిలో సిగరెట్ పట్టుకుని ఊదేస్తున్నారు. కోడింగ్ చేసేటప్పుడు మైండ్ రిలాక్స్ అవ్వడానికైనా లేదా కొత్త ఇన్వెస్టర్లను కలవడానికైనా ఇదే మార్గంగా ఎంచుకుంటున్నారు. 1966లో అమెరికాలో 40 శాతానికి పైగా జనాలు ధూమపానం చేసేవారు. కాలక్రమేణా ఆ సంఖ్య 10 శాతానికి పడిపోయింది. అలాంటిది ఇప్పుడు మళ్లీ ఐటీ కంపెనీల ప్రాంగణాల్లో ఈ సిగరెట్ పొగలు కమ్మేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

### ఒకే ఒక్క సిగరెట్ బ్రేక్‌తో బిజినెస్ డీల్

రివాంప్ ఏఐ సహ వ్యవస్థాపకుడు స్టీఫెన్ క్యాంప్‌బెల్ అనుభవం ఇందుకు ఒక మంచి ఉదాహరణ. చైనాలోని ఒక పెద్ద టెక్ కంపెనీతో బిజినెస్ డీల్ మాట్లాడటానికి వెళ్లినప్పుడు భాష రాక ఆయన చాలా ఇబ్బంది పడ్డారు. ఆ తర్వాత ఒక రెస్టారెంట్‌లో అందరూ కలిసి సిగరెట్లు తాగుతూ మాట్లాడటం మొదలుపెట్టారు. ఆ పొగ వెనుక కుదిరిన సంబంధం వల్లనే అంత పెద్ద బిజినెస్ డీల్ ఓకే అయిందని ఆయన చెబుతుంటారు. శాన్ ఫ్రాన్సిస్కోలో తన ఇరుగుపొరుగు వారితో మాట్లాడాలన్నా, కొత్త ఉద్యోగులను నియమించుకోవాలన్నా కూడా ఈ సిగరెట్ బ్రేక్ చాలా బాగా ఉపయోగపడుతోంది.

### పాతకాలపు సిగరెట్లకు పెరిగిన మోజు

ఒకప్పుడు నికోటిన్ కోసం వేప్‌లు, ఫ్లేవర్డ్ పౌచ్‌లను ఐటీ ఉద్యోగులు బాగా వాడేవారు. ఆఫీసుల్లో ఆవిర్లు కక్కుతూ గమ్స్‌కి నికోటిన్ ప్యాకెట్లు పెట్టుకుని కోడింగ్ చేసేవారు. కానీ ఇప్పుడు ఆ పద్ధతులన్నీ పాతబడిపోయాయని చెబుతూ, నేరుగా పాతకాలపు సిగరెట్లను తీసి పొగ వదులుతున్నారు. కఠినమైన పని ఒత్తిడిని తట్టుకోవడానికి, గంటల తరబడి కంప్యూటర్ల ముందు కూర్చుని అలసిపోయిన మైండ్‌ను రిఫ్రెష్ చేసుకోవడానికి చాలామంది ఇంజనీర్లు చైన్ స్మోకింగ్ చేస్తున్నారు.

### ఇన్వెస్టర్లను ప్రసన్నం చేసుకునే కొత్త దారి

జనరల్‌గా ఇన్వెస్టర్లను ప్రసన్నం చేసుకోవడానికి ఫౌండర్లు చాలా హుందాగా నటించడానికి ట్రై చేస్తారు. కానీ సిగరెట్ తాగే ఫౌండర్లు మాత్రం ఎవరికీ భయపడకుండా చాలా ఓపెన్‌గా ఉంటారంట. వారిని చూడగానే వీళ్లు దేనికీ వెనకాడరు అనే నమ్మకం ఇన్వెస్టర్లలో కలుగుతుందట. బయట టీ తాగుతూ లేదా సిగరెట్ వెలిగిస్తూ మాట్లాడేటప్పుడు మనుషుల అసలు నైజం బయటపడుతుంది. బార్లు, పబ్‌ల బయట పాతికేళ్ల కుర్రాళ్లు గుంపులుగా చేరి సిగరెట్ ప్యాకెట్లను షేర్ చేసుకుంటున్నారు.




### ఆరోగ్యం కంటే వ్యాపార ప్రయోజనాలే మిన్న...

రోజంతా హెల్తీ డైట్ పాటిస్తూ, వీకెండ్స్‌లో మాత్రం ఫ్రెండ్స్‌తో కలిసి సిగరెట్లు తాగుతున్నారు. ఒకవైపు ఆరోగ్యం కోసం లక్షలు ఖర్చు చేస్తూనే, మరోవైపు మనశ్శాంతి కోసం సిగరెట్ పొగను నమ్ముకుంటున్నారు. భవిష్యత్తులో ఏఐ టెక్నాలజీ రోగాలన్నింటినీ నయం చేస్తుందని, ఏఐ రోబోలు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను కూడా సులభంగా నయం చేస్తాయని కొందరు విచిత్రంగా సమర్థించుకుంటున్నారు. పెద్ద పెద్ద బిజినెస్ డీల్స్ ఓకే చేసుకోవడం కోసం చివరికి సిగరెట్ పొగను కూడా ఒక బిజినెస్ సీక్రెట్‌గా మార్చేయడం నిజంగా ఆశ్చర్యపరిచే విషయమే.


# హైదరాబాద్‌లో హార్వర్డ్ కోర్సులు

## విదేశీ విద్యా సంస్థల రాకతో పరిశోధనల విప్లవం

**ప్ర**పంచ ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లోని ఔత్సాహికులకు ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులను డిసెంబర్ నుంచి అందించనుంది. తెలంగాణను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్టు యూకే బిజినెస్ స్కూల్స్ ప్రతినిధుల బృందం భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.

**- సహానం వందే, హైదరాబాద్**

- ఎంఐటీ, పర్డ్యూ ఆఫ్‌షోర్ క్యాంపస్‌ల ప్రక్రియ షురూ
- 2047 నాటికి రూ. 251.28 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థ




ఎంసీఆర్ హెచ్ఆర్డీలో జరిగిన ఈ కీలక సమావేశంలో యూకే హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడు కరణ్ బిలిమొరియా, బ్రిటిష్ కౌన్సిల్ డైరెక్టర్ జనక పుష్పనాథన్, చార్టర్డ్ అసోసియేషన్ ఆఫ్ బిజినెస్ స్కూల్స్ సీఈఓ ఫ్లోరా హమిల్టన్, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ప్రతినిధులతో సహా 30 మంది యూకే విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయాల అవసరాలకు తగ్గట్టు సహకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

### గ్లోబల్ వర్సిటీల భాగస్వామ్యం

హార్వర్డ్, ఎంఐటీ, పర్డ్యూ వంటి ప్రముఖ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించాయి. విదేశీ విద్యాసంస్థలతో స్థానిక విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు కలిసి పరిశోధనలు చేస్తాయి. హార్వర్డ్, ఎంఐటీ, లండన్ విశ్వవిద్యాలయం, వర్జీనియా టెక్, నార్త్‌ఈస్టర్న్ విశ్వవిద్యాలయాలతో ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లు, డ్యూయల్ డిగ్రీలు, అధ్యాపకులకు శిక్షణ ఇస్తాయి.

### ఫ్యూచర్ సిటీ రూపకల్పన

యువతకు అత్యాధునిక నైపుణ్య శిక్షణ అందించేందుకు భారత్ ఫ్యూచర్ సిటీలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో దేశంలోనే మొట్టమొదటి నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నారు. అక్కడ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటుతో భావితరాలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

### ప్రపంచ దిగ్గజాల భారీ పెట్టుబడులు

డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కు యూకే ప్రతినిధి బృందాన్ని ఆహ్వానించారు. దావోస్‌లో నిర్వహించే వరల్డ్ ఎకనామిక్ ఫోరం తరహాలో దీనిని నిర్వహిస్తున్నారు. ఫ్యూచర్ సిటీలో రూ. 70 వేల కోట్లతో ఏఐ డేటా సెంటర్‌ను టీసీఎస్ నిర్మిస్తోంది. అలాగే అమెజాన్ రూ. 100000 కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ నిర్మాణం చేపట్టింది.

### విద్యా వ్యవస్థలో సమగ్ర మార్పులు

నర్సరీ నుంచి ఉన్నత విద్య వరకు, ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలు, స్కిల్స్ యూనివర్సిటీల ద్వారా నైపుణ్యాలను పెంపొందిస్తున్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా విద్యా వ్యవస్థను మార్చుతున్నారు. ప్రపంచంలోనే మేటి విశ్వవిద్యాలయాలు, ఫార్చ్యూన్-500 కంపెనీలు రాష్ట్రంలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

### ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యాలు

తెలంగాణను 2034 నాటికి రూ. 83.76 లక్షల కోట్లు (1 ట్రిలియన్ డాలర్లు), 2047 నాటికి రూ. 251.28 లక్షల కోట్ల (3 ట్రిలియన్ డాలర్లు) ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వివరించారు. విదేశీ బిజినెస్ స్కూల్స్ రాకతో కార్పొరేట్ సంస్థలు రాష్ట్రం వైపు చూస్తాయి. రాష్ట్ర విద్యార్థులు, అధ్యాపకులకు అంతర్జాతీయ అవకాశాలు అందుబాటులోకి వస్తాయి.

# మోడీ గిఫ్టుల వేలంలో కాకతీయ కళాతోరణం

## 9 లక్షల ప్రారంభ ధరతో కళ్లుచెదిరే రేటు

**తె**లంగాణ శిల్పకళా వైభవానికి నిదర్శనమైన కాకతీయ కళాతోరణం వెండి రూపంలో వెలిగిపోతే ఎలా ఉంటుందో ఊహించారా? దేశ ప్రధాని నరేంద్ర మోదీకి వచ్చిన కానుకల వేలంలో ఇప్పుడు మన కళాతోరణమే హాట్ టాపిక్‌గా మారింది! అసలు మన దక్కన్ సంస్కృతికి దక్కిన ఈ అరుదైన గౌరవం వెనుక ఉన్న కథేంటి? వేలంలో ఉన్న ఇతర విలువైన వస్తువుల సంగతేంటి?

**- సహానం వందే, న్యూఢిల్లీ**

- తెలంగాణకు గర్వకారణంగా కళాఖండం
- శ్రీరాముడి వెండి విగ్రహానికి అత్యధిక ధర
- ఆన్‌లైన్ వేదికగా వేలం...ఎగబడుతున్న జనం
- ప్రధాని దేశ విదేశీ బహుమతుల వేలంపై చర్చ



దక్షిణ భారతీయ శిల్పకళా ప్రతీక, తెలంగాణకు గర్వకారణమైన కాకతీయ కళాతోరణం ఇప్పుడు జాతీయ స్థాయిలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రధానికి అందిన ఈ అరుదైన వెండి నమూనాను కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఎనిమిదో విడత ఈ-వేలంలో ఉంచింది. దీని ప్రారంభ ధరనే ఏకంగా 9 లక్షల రూపాయలుగా నిర్ణయించారు. కాకతీయుల వైభవాన్ని, మన ప్రాచీన సంస్కృతిని ప్రతిబింబించేలా దీన్ని అత్యంత అద్భుతంగా డిజైన్ చేశారు.

### శ్రీరాముడి వెండి విగ్రహానికి భారీ రేటు...

ఈసారి వేలం జాబితాలో అత్యధిక బేస్ ప్రైస్ సాధించిన వస్తువుగా కర్ణాటక నుంచి వచ్చిన శ్రీరాముడి వెండి విగ్రహం నిలిచింది. దీని ప్రారంభ ధర 13.50 లక్షల రూపాయలు. కళాతోరణం కంటే ముందే ఈ విగ్రహం మొదటి స్థానంలో నిలిచి వేలం పాటలో తీవ్ర పోటీని నెలకొల్పుతోంది. ఈ ఆధ్యాత్మిక కళాఖండాన్ని దక్కించుకోవడానికి పెద్ద పెద్ద వ్యాపారవేత్తలు పోటీ పడుతున్నారు. ఈ ఎనిమిదో విడత వేలంలో మొత్తం 1,498 విశిష్టమైన గిఫ్టులను ప్రజల ముందుకు తెచ్చారు. గురువారం నుంచి ప్రారంభమైన ఈ ఆన్‌లైన్ వేలంలో దాదాపు 50 రకాల 'హీరో ఆబ్జెక్ట్స్' ఆకట్టుకుంటున్నాయి. తనకు అందిన ప్రతి బహుమతిని దేశ ఆస్తిగా భావించి, తిరిగి ప్రజలకే అందించాలనే ఆలోచనతో ప్రధాని ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

### గిరిజన సాంప్రదాయాలకు పెద్దపీట...

ఈ వేలంలో మన గిరిజన సాంప్రదాయాలకు కూడా ఎంతో ప్రాముఖ్యతనిచ్చారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు చెందిన ప్రాచీన గోండ్ ఆర్ట్ శైలిలోని "ట్రీ ఆఫ్ లైఫ్" పెయింటింగ్‌ను కూడా ఉంచారు. అందమైన ఫ్రేమ్‌తో కూడిన ఈ అరుదైన పెయింటింగ్ ప్రారంభ ధర 7.50 లక్షల రూపాయలు. మన ప్రాచీన గిరిజన కళలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తేవడంలో ఈ వేలం ఎంతగానో తోడ్పడుతోంది. ఒడిశా సంస్కృతికి చిహ్నంగా రథంపై కొలువుదీరిన జగన్నాథ పరివార్ ప్రతిమ ప్రారంభ ధరను 6 లక్షల రూపాయలుగా నిర్ణయించారు. దీనితో పాటు 99.99 శాతం స్వచ్ఛమైన బంగారు పూత పూసిన రాధాకృష్ణుల ఫ్రేమ్డ్ ఆర్ట్‌వర్క్ ధర 5.40 లక్షల రూపాయలుగా ఉంది. భక్తి, శిల్పకళల కలయికగా ఉన్న ఈ వస్తువులకు ఆధ్యాత్మిక ప్రియుల నుంచి భారీగా డిమాండ్ ఉంది.

### బహుమతులన్నీ ప్రజలకే...

ఈ కార్యక్రమం గురించి కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ... ప్రధాని మోదీ ఎప్పుడూ స్వార్థంతో ఆలోచించలేదని, దేశం తనకు ఇచ్చినది ఏదైనా సరే తిరిగి ప్రజలకే చెందాలని నమ్ముతారని చెప్పారు. ప్రజలు తనకు ఇచ్చిన గౌరవాన్ని తిరిగి సంక్షేమ రూపంలో అందించడమే నిజమైన ప్రజాసేవ అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కానుకలు తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, అస్సాం, బీహార్, ఒడిశా వంటి పలు రాష్ట్రాల నుంచి అందినవి. మన దేశంలోని విభిన్న కళారూపాలు, సాంప్రదాయ చేతివృత్తులు, ఆధ్యాత్మిక మూలాలు, క్రీడాకారులు సాధించిన విజయాలకు సంకేతంగా నిలిచే అనేక రకాల మెమోంటోలు ఈ ఆన్‌లైన్ వేదికపై లభిస్తున్నాయి.

### 2019 నుంచి ఆన్‌లైన్ వేలం...

ప్రధానికి వచ్చిన కానుకలను ఆన్‌లైన్ వేలంలో పెట్టే సంస్కృతిని మొదటగా 2019 జనవరిలో ప్రారంభించారు. పార్లమెంటులో వెల్లడించిన అధికారిక లెక్కల ప్రకారం, ఇప్పటివరకు జరిగిన ఏడు విడతల వేలం పాటల ద్వారా ఏకంగా 52 కోట్ల రూపాయల నిధులు సమకూరాయి. భారతదేశపు అద్భుతమైన కళలను కాపాడుతూనే, ఇంతటి భారీ నిధులను సేకరించడం దీని ప్రత్యేకత. గత వేలం పాటల చరిత్రను పరిశీలిస్తే, అత్యధిక ధరకు అమ్ముడైన రికార్డు ఒక క్రీడా పరికరం పేరిట ఉంది. 2021లో జరిగిన వేలంలో ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా ప్రధానికి బహుమతిగా ఇచ్చిన ఈటె (జావెలిన్) ఏకంగా కోటిన్నర రూపాయలకు అమ్ముడుపోయింది. ఇప్పటివరకు జరిగిన అన్ని వేలంలలోనూ ఇదే అత్యంత ఖరీదైనదిగా చరిత్రకెక్కింది.